# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY

తెలుగు దినపత్రిక



**లంచగొండుల వివరాలు ఎసిబికి తెలపండి**

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,



## సోఫా తయారీ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం

హైదరాబాద్ : నగరంలో వరుస అగ్ని ప్రమాదాలు కలకలం రేపుతున్నాయి. తాజాగా బహదూర్‌పురా పరిధిలోని కిషన్‌బాగ్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ సోఫా తయారీ కేంద్రంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే మంటలు విస్తరించడంతో ఆ ప్రాంతం దట్టమైన పొగతో నిండి పోయింది. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచరమిచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. సోఫా తయారీ కేంద్రం చుట్టుపక్కల జనావాసాలు ఉండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటలు పక్కన ఉన్న ఇళ్లకు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.


నల్లగొండ సంపుటి:16 సంచిక:100 ఎడిటర్: సయ్యద్ పాష 29-04-2026 బుధవారము పేజీలు :8 వెల:1/-


## సిక్కిం అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకుంది

### - ఆ విధానాలకు కేంద్రం కట్టుబడి ఉంది: మోదీ



సిక్కిం పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్?పై విమర్శలు గుప్పించారు. సిక్కిం అభివృద్ధిని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అడ్డుకున్నాయని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి మళ్లీ పుంజుకుందని అన్నారు. మతం, రాజకీయాల పేరుతో దేశాన్ని విడగొట్టే ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో హిమాలయ రాష్ట్రమైన సిక్కిం జాతి ఐక్యతను సగర్వంగా చాటిచెబుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని సిక్కిం అద్భుతంగా ప్రతిబింబిస్తోందని ప్రశంసించారు. సిక్కిం రాష్ట్ర ఆవిర్భావించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు సాధిస్తున్న అభివృద్ధి చాలా ముందే సాధ్యమయ్యేది. కానీ వరుసగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు సిక్కిం అభివృద్ధిని అడ్డుకున్నాయి. అభివృద్ధి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశాయి. సివోక్–రాంగ్పో రైల్వే ప్రాజెక్టు 2008–09లోనే ఆమోదం లభించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎలాంటి పురోగతి లేదు. కేవలం పేపర్ మీదనే పనులు జరిగాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి జోరందుకుంది. తొలిసారిగా సిక్కింకు రైలు రాబోతోంది' అని ప్రధాని మోదీ అన్నారు. సిక్కిం, ఈశాన్య ప్రాంతం మన దేశానికి ముఖ్య భాగాలే కాదని, అవి అష్టలక్ష్మి లాంటివి అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యాక్ట్ ఈస్ట్ పాలసీతో పాటు, ఈశాన్య ప్రాంత అభివృద్ధికి యాక్ట్ ఫాస్ట్ విధానాన్ని కూడా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. వివిధ రంగాలకు చెందిన 30కి పైగా ప్రాజెక్టులను ప్రారంభించినట్లు తెలిపారు. సిక్కింలో కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందనట్టు చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పన ద్వారా సిక్కింకు దేశంలోని ఇతర ప్రాంతాలతో మరింత సులభమైన రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. సిక్కిం సహా ఈశాన్య రాష్ట్రాలన్నీ భవిష్యత్ వృద్ధికి, సుస్థిర అభివృద్ధికి కేంద్రాలుగా మారనున్నాయని ప్రధాని ఉద్ఘాటించారు. సిక్కిం ఆర్థిక వృద్ధికి పర్యాటక రంగమే కీలకమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 'దేశ మొత్తం విస్తీర్ణంలో 1 శాతం కూడా లేని సిక్కింలో, 25 శాతం వృక్ష జాతులు ఉన్నాయి. 500కు పైగా పక్షుల జాతులు, 700కు పైగా సీతాకోకచిలుకలు, అరణ్య సంపద, అలాగే కాంచెంజుంగా పర్వత మహిమ సిక్కింను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. ప్రకృతి సౌందర్యం వల్ల పర్యటకులు మళ్లీ మళ్లీ రావాలనుకునే రాష్ట్రంగా సిక్కిం నిలుస్తోంది. రాష్ట్రంలోని రోడ్ల పరిశుభ్రత, గాలి స్వచ్ఛత చూస్తుంటే, ఇక్కడి ప్రజలు ప్రకృతి పరిరక్షణకు నిజమైన బ్రాండ్ అంబాసిడర్లు అని స్పష్టమవుతోంది. నేను ఆర్కిడేరియంను సందర్శించా. అక్కడ చాలా సమయం గడిపాను. ప్రకృతి ప్రేమికులైన పర్యటకులకు నేను చెప్పేది ఆర్కిడ్లను చూడకపోతే, వారు ఏమీ చూడనట్లే. ఈ సంవత్సరం సిక్కిం అన్ని పర్యాటక రికార్డులను బద్దలు కొడుతుందని నేను విశ్వసిస్తున్నా' అని ప్రధాని మోదీ తెలిపారు. సిక్కిం రాష్ట్ర స్థాపన వేడుకల ముగింపు సందర్భంగా రూ. 4వేల కోట్లకు పైగా విలువైన పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు. ఈ ముగింపు వేడుకల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. ముఖ్యంగా భారత పటం ఆకారంలో పలువురు కళాకారులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. సిక్కింలో మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ విద్య, విద్యుత్, పట్టణాభివృద్ధి, పర్యావరణం, పర్యాటకం, వ్యవసాయం వంటి విస్తృత రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులున్నాయి.

## వ్యక్తిగతంగా చొరవ తీసుకుని సహకరించండి



హైద్రాబాద్: చర్లపల్లి రైల్వేస్టేషన్ కు ఇరువైపులా అప్రోచ్ రోడ్ల విస్తరణ, పార్కింగ్ తదితర అవసరాల నిమిత్తం అవసరమైన భూమి కేటాయింపు, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అప్రోచ్ రోడ్డు విస్తరణపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం లేఖ రాశారు. హైదరాబాద్ నగరంలో నానాటికీ పెరుగుతున్న జనాభా, ప్రయాణికుల రాకపోకల మూలంగా నగరం లోని మూడు ప్రధాన రైల్వేస్టేషన్లు కాచిగూడ, సికింద్రాబాద్, హైదరాబాద్ రైల్వేటర్మినల్లపై అధిక భారం పడుతుందని... ఈ సమస్యకు పరిష్కారంగా నగర పరిధిలోని చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద రూ. 430 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో కొత్త టెర్మినల్‌ను అభివృద్ధి చేయడం జరిగింది అని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతులమీదుగా 6 జనవరి 2025 న ఈ నూతన టర్మినల్‌ను ప్రారంభించుకున్నామని ఆ కార్యక్రమంలో తమరు పాల్గొన్నారని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త రైల్వే టర్మినల్‌ను ప్రారంభించుకున్న తరువాత ప్రతి రోజూ కొన్ని పదుల సంఖ్యలో రైళ్లు చర్లపల్లి నుంచి సేవలు అందిస్తున్నాయి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అందువల్ల ఈ రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణిస్తున్న ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. దీనికి అనుగుణంగా రైల్వేస్టే షన్ కు వెలుపల ఇరువైపులా ప్రయాణికులు, వాహనాలు రైల్వేస్టేషన్ కు సులభంగా రాకపోకలు సాగించటానికి వీలుగా అప్రోచ్ రోడ్లను విస్తరించవలసిన అవసరం ఉంది. అలాగే పార్కింగ్ తదితర అవసరాల కోసం స్టేషన్ కు ఇరువైపులా అవసరమైన భూసేకరణ పూర్తి చేయవలసి ఉంది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. గతంలో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కి 15 జూన్, 2022 న, 07 మార్చి, 2023 న రెండు ఉత్తరాలు రాయడం జరిగింది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు. అలాగే 08 సెప్టెంబర్ 2024 న తమరికి కూడా ఉత్తరం ద్వారా విషయం తెలియజేశాను. అయినప్పటికీ ఈ విషయంలో ఇప్పటి వరకూ పనులు ప్రారంభం కాలేదు అని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'మీరు నేను వ్రాసిన ఉత్తరం ఆధారంగా తెలంగాణ ప్రభుత్వ అధికారులకు సమస్య పరిష్కరించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశాలు కూడా ఇచ్చారు. అధికారుల బృందం రైల్వేస్టేషన్ అప్రోచ్ రోడ్లను పరిశీలించి చర్యలకు ఉపక్రమించినప్పటికీ, ఇంతవరకు ఎలాంటి ఫలితం లేదు. కావున ఈ విషయంలో మీరు వ్యక్తిగతంగా చొరవ చూపించి, నగరానికి ఎంతో అవసరమైన చర్లపల్లి రైల్వేస్టేషన్ కు ఇరువైపులా అప్రోచ్ రోడ్ల విస్తరణ, పార్కింగ్ తదితర అవసరాల నిమిత్తం అవసరమైన భూమి కేటాయింపు, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అప్రోచ్ రోడ్డు విస్తరణకు అన్ని రకాల సహాయ సహకారాలను తక్షణమే అందించేలా చర్యలు తీసుకోవాలి' అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖలో సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

## పెట్రోల్ బంకుల్లో బారులుతీరిన జనం



హైద్రాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పెట్రోల్, డీజిల్ కొరత నెలకొంది. హైదరాబాద్‌లోని పలు బంకుల్లో మూడో రోజూ నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. పెట్రోల్ ఉన్న బంకుల ముందు వాహనాలు బారులు తీరుతున్నాయి. చంపాపేట్, ఐఎస్ సదన్‌లో పెట్రోల్ బంకుల ముందు వాహనదారులు ఆందోళనకు దిగారు. గంటల తరబడి క్యూలో ఉండాల్సి వస్తోందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు రోడ్లపై నిలవడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతోంది. బంకుల వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు కొన్నిచోట్ల పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనదారులు బాటిల్స్, క్యాన్స్ లలో ఇంధనం నింపుకోకుండా పహారా కాస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 193 బంకులు ఉన్నాయి. అందులో ఎక్కువ శాతం బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. డీజిల్ ఎక్కడా దొరకడం లేదని, కొన్ని బంకుల్లో మాత్రమే అదీనూ పరిమిత స్థాయిలోనే పెట్రోల్ లభిస్తుందని వాహనదారులు చెబుతున్నారు. బండి చక్రం నడిస్తేనే తమ బతుకు చక్రం సాగుతుందని వారు చెబుతున్నారు. కొరతగా ఉందన్న ప్రచారం : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొరతగా ఉందన్న ప్రచారంతో వాహనదారులు క్యూ లైన్లు కడుతున్నారు. పెట్రోల్, డీజిల్ దొరకడం లేదన్న వదంతులతో బంకుల్లో వాహనాలతో బారులు తీరిన వాహనదారులు, పెద్ద డబ్బాల్లో పెట్రోల్, డీజిల్ తీసుకెళ్తున్నారు. కొరత లేకుండా పెట్రోల్, డీజిల్ అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మరోవైపు బంకుల్లో పెట్రోల్, డీజిల్ అయిపోగానే, సరిపడా స్టాక్ బంకులకు వస్తోందని నిర్వాహకులు చెబుతున్నారు. వాహనదారులు వదంతులను నమ్మి బంకుల్లో బారులు తీరి, పెద్ద డబ్బాల్లో పెట్రోల్, డీజిల్ తీసుకెళ్లవద్దని సూచిస్తున్నారు. స్టాక్ ఉన్నప్పటికీ పంపిణీ చేయని పరిస్థితి : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ల కోసం రైతులు, వాహనదారులు బంకుల ముందు బారులు తీరుతున్నారు. మహబూబాబాద్ పట్టణంలోని ఇల్లందు రోడ్డులో పెట్రోల్ బంకులో స్టాక్ ఉన్నప్పటికీ పంపిణీ చేయడం లేదంటూ బంక్ ఎదుట రహదారిపై వాహనదారులు, రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళనతో మహబూబాబాద్-ఇల్లందు ప్రధాన రహదారిపై ఇరువైపుల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ఈ ప్రాంతంలో రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న సీఐలు అంజలి, మహేందర్ రెడ్డి సిబ్బందితో పెట్రోల్ బంక్ వద్దకు చేరుకొని అందరికీ నచ్చచెప్పి రాస్తారోకోను విరమింపచేశారు. అర్ధరాత్రి దాటినా బంకుల ముందు క్యూ లైన్ లే దర్శనమిచ్చాయి. ఎక్కడికక్కడే నిలిచిపోయిన ప్రజా రవాణా : పెట్రోల్, డీజిల్ స్టాక్ లేకపోవడంతో ప్రజా రవాణా వ్యవస్థ వాహనాలు, సరకు రవాణా వాహనాలు, వ్యవసాయ, వాణిజ్య యంత్రాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం పెట్రోల్, డీజిల్ ఎప్పుడు వస్తుందో చెప్పేవారే కరవయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాహనదారులు అయోమయంలో పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంకులో డీజిల్ అందుబాటులో ఉన్నప్పటికీ పంపిణీ చేయడం లేదని అంటున్నారు. గంటల తరబడి డీజిల్ కోసం బంకు ఎదుట నిరీక్షిస్తున్నామని చెబుతున్నారు. హార్వెస్టర్లకు డీజిల్ దొరకక రైతుల ఇబ్బందులు : పలు ప్రాంతాల్లో బంకు నిర్వాహకులు తాళం వేసుకొని వెళ్లిపోయారని వాపోయారు. వరి, మొక్క జొన్న కోతలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో కోత యంత్రాలకు (హార్వెస్టర్స్) డీజిల్ దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని వర్షాలు పడితే కల్లాల్లో ఉన్న పంటలు మొలకెత్తే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డీజిల్ పంపిణీ చేయాలని కోరుతున్నారు. లేదంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు. జిల్లా సివిల్ సప్లై అధికారులు మాత్రం జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని, ఎవరూ ఆందోళన చెందొద్దని చెప్పడం గమనార్హం.

## తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు



హైదరాబాద్, : తెలంగాణలో పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి కొరత లేదని పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. రాష్ట్రంలో సుమారు 70 రోజులకు సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని తెలిపారు. మంగళవారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. భయంతో ప్రజలు అవసరం కంటే ఎక్కువగా పెట్రోల్, డీజిల్‌ను కొనుగోలు చేయడం వల్లే కొన్ని పెట్రోల్ బంకుల వద్ద తాత్కాలికంగా స్టాక్ అయిపోయినట్లు కనిపిస్తోందని ఆయన అన్నారు. పెట్రోల్ బంకులు 'నో స్టాక్' బోర్డులు పెట్టినప్పటికీ, రోజువారీ అమ్మకాల కంటే ఎక్కువగా అమ్మకాలు జరుగుతున్నట్లు మానిటరింగ్‌లో తెలుస్తోందని స్టీఫెన్ రవీంద్ర వివరించారు. బెంగాల్ ఎన్నికల తర్వాత ధరలు పెరుగుతాయన్న భయంతో ప్రజలు అధిక మొత్తంలో ఇంధనం కొనుగోలు చేస్తున్నారని ఆయన చెప్పారు. గత వారం ఇండస్ట్రియల్ డీజిల్ ధరలు పెరగడంతో నష్టాలను తగ్గించుకోవడానికి వ్యాపారులు, వినియోగదారులు డీజిల్‌ను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నట్లు గమనించామని ఆయన తెలిపారు. ఈ సమస్య ఈరోజు రాత్రి వరకు పూర్తిగా పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు. ఏపీ సరిహద్దు జిల్లాల్లో పరిస్థితిని నిరంతరం మానిటరింగ్ చేస్తున్నామని పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు.

## రెండు రైళ్లు ఢీ.. 14 మంది మృతి



హైదరాబాద్: ఇండోనేషియా రాజధాని జకార్తా సమీపంలో జరిగిన రెండు రైళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 14 మంది మృతి చెందారు. 84 మందికిగా గాయాలయ్యాయి అని రైలు నిర్వహణ సంస్థ మంగళవారం తెలిపింది. సహాయక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్స్ చేపట్టి శిథిలాల కింద వారిని బయటకు తీశారు. జకార్తాకు సమీపంలోని బెకాసిలో సోమవారం రాత్రి ఒక ప్రయాణీకుల రైలు, ఒక సుదూర ప్రాంత రైలు (సిటీ రైలు) ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంపై ఇండోనేషియా ప్రభుత్వ రైల్వే సంస్థ పీటీ కేఏఐ ముఖ్య కార్యనిర్వహణాధికారి బాబీ రషీదిన్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. ప్రయాణీకుల రైలు మొదట పట్టాలపై ఉన్న టాక్సీని ఢీకొట్టింది. ఆ తర్వాత ఆ రైలును సుదూర ప్రాంత రైలు రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కు పెరిగిందని తెలిపారు. మహిళలు మాత్రమే ప్రయాణించే బోగీ ఈ ప్రమాదంలో తీవ్రంగా దెబ్బతింది. బాధితులందరూ మహిళలే. ఆ బోగీల్లో నుజ్జునుజ్జయిన ఇనుప కడ్డీల కింద మహిళల మృతదేహాలున్నాయి. రెస్క్యూ సిబ్బంది రైళ్లను విడదీయడానికి ముందు, యాంగిల్ గ్రైండర్లను ఉపయోగించి కంపార్ట్‌మెంట్ల లోహాన్ని కోసి, ప్రాణాలతో ఉన్నవారిని బయటకు తీశారు. మంగళవారం మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని వారి బంధువులకు సంబంధించిన మృతదేహాలను వెతుకున్నారని పోలీసులు తెలిపారు. కాగా ఈ ఘటనపై అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై అధికారులు దర్యాప్తు చేస్తారని ఆయన తెలిపారు. రైలు నెట్‌వర్క్‌లోని చాలా భాగాలు సరిగా నిర్వహించబడటం లేనందు వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన అన్నారు. తీవ్రమైన ట్రాఫిక్ రద్దీని పరిష్కరించడంలో సహాయపడటానికి రైలు పట్టాల సమీపంలో ఒక ఫ్లైఓవర్ నిర్మించడానికి తాను అంగీకరించానన్నారు. ఈ ప్రమాదంపై ఇండోనేషియా జాతీయ రవాణా భద్రతా కమిటీ (కెఎన్‌కెటి) దర్యాప్తు చేస్తోంది. ఇజ్రాయిల్‌తో ప్రత్యక్ష చర్చల వల్ల లెబనాన్‌కు ఫలితాలు లేనట్లే ఉన్నాయి. ఈ చర్చలతో మాకెలాంటి సంబంధం లేదు. లెబనాన్, ఆ దేశ దాని ప్రజల కోసం మేము మా రక్షణాత్మక ప్రతిఘటనను కొనసాగిస్తాము అని నజీమ్ ఖాసిమ్ ప్రకటనలో పేర్కొన్నారు. శత్రువు ఎంత బెదిరించినా మేము వెనకడుగు వేయము. తలవంచము, ఓటమిని అంగీకరించము అని ఆయన ఇజ్రాయిల్ చర్యలపై ధీటుగా స్పందించారు.

## క్రేన్ ప్రమాద బాధితులను పరామర్శించిన మంత్రి వివేక్



శంకర్ పల్లి:: శంకర్ పల్లి మండలం మహాలింగపురం గ్రామ శివారుల్లోని నాగార్జున కన్స్ట్రక్షన్ కంపెనీ ఫ్యాబ్రికేషన్ కంపెనీలో జరిగిన ఘటన బాధాకరమని తెలంగాణ కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి సమీపంలోని మహాలింగాపురం లో ఉన్న ఎన్సీసీ కంపెనీలో సోమవారం మధ్యాహ్నం కురిసిన ఈదురు గాలులు భారీ వర్షానికి క్రేన్లు కూలడంతో ప్రమాదం జరిగిందన్నారు. అప్పటికే షెడ్డులో వర్షానికి తలదాచుకుంటున్న 17 మంది కార్మికులు బలయ్యారని అన్నారు. వీరిలో ఘటనాస్థలిలో ఇద్దరు మృతిచెందగా ఆసుపత్రికి తరలిస్తుండగా చికిత్స పొందుతూ మరో ముగ్గురు మృతి చెందారు. ప్రస్తుతం ఇద్దరు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన మంగళవారం ఉదయం పరామర్శించారు కంపెనీ వారితో మాట్లాడి మృతుల కుటుంబాలలో ఒకరికి శాశ్వత ఉద్యోగం వచ్చేలా చర్చలు జరుపుతున్నామని శాశ్వతంగా మృతులకు వేతనం వచ్చేలా కంపెనీ చర్యలు తీసుకుంటున్నామని ఇప్పటికే తెలిపింది అన్నారు. ప్రభుత్వం నుంచి వారికి అండగా ఉంటామన్నారు. శతగాత్రుల వైద్యం పూర్తయ్యే వరకు ఖర్చులను కంపెనీ భరిస్తుంది అన్నారు.

దేశ టైమ్స్

# సంపాదకీయం

## చాలా మంది కార్మికులు రోజుకు 12 నుంచి 14 గంటలపాటు పనిచేయవలసి వస్తోంది...

దేశంలోని అనేక కర్మాగారాల్లో పనికి వెళ్లడం అనేది ఒక యుద్ధానికి వెళ్లినట్టుగా, తమ ప్రాణాలను పణంగా పెట్టి వెళ్లినట్టుగా అనిపిస్తోంది. ఈ పరిస్థితి ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. తయారీ రంగం వృద్ధి చెందుతున్నప్పటికీ, కార్మికుల భద్రత, పని పరిస్థితులు ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. అసంఘటిత రంగంలో 90 శాతం పైగా కార్మికులు భద్రతా పరిధిలో లేరని నివేదికలు చెబుతున్నాయి. చాలా మంది కార్మికులు రోజుకు 12 నుంచి 14 గంటలపాటు పనిచేయవలసి వస్తోంది. 70 గంటల పనివారం వంటి ప్రతిపాదనలు ఈ ఒత్తిడిని మరింత పెంచుతున్నాయి. అంచనాల ప్రకారం దేశంలో రోజుకు సుమారు ముగ్గురు ఫ్యాక్టరీ కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. మరో 11మంది తీవ్రగాయాల పాలవుతున్నారు. గత వారంలో మూడు ఫ్యాక్టరీల్లో పేలుళ్లు సంభవించి 60 మంది కన్నా ఎక్కువ మంది చనిపోయారు.ఇటువంటి వార్తలు ఏ సున్నితమైన దేశాన్నయినా, ఆత్మపరిశీలన చేసుకుని తప్పులు సరిదిద్దుకునేలా హెచ్చరిస్తాయి. 1976 జులై 10న సెలెసో సమీపంలోని ఐసిఎంఇఎస్ఎ ఫ్యాక్టరీలో జరిగిన పేలుడు వల్ల ప్రజలు అత్యంత విషపూరిత డయాక్సిన్‌కు గురయ్యారు. ఈ విపత్తు తర్వాత పారిశ్రామిక ప్రమాదాలను అరికట్టేందుకు పర్యావరణ పరిరక్షణకు కఠినమైన నిబంధనలతో 'సెవెసో డైరెక్టర్'ను 1982లో యూరప్ దేశాల యూనియన్ అమలులోకి తెచ్చింది. ఈ సంఘటన పారిశ్రామిక భద్రతలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలికింది. 2019 2022 మధ్యకాలంలో యూరప్ యూనియన్ దేశాల్లో ఏడాదికి 22 వంతున పారిశ్రామిక ప్రమాదాలు జరిగాయి. కొరియాలో లిథియం బ్యాటరీ మేకర్ ఎయిర్‌సెల్ ఫ్యాక్టరీలో పేలుడు సంభవించి 23మంది కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.ఈ ప్రమాదానికి బాధ్యుడ్ని చేస్తూ ఆ సంస్థ సిఇఒకు నిన్న నాలుగేళ్ల జైలు శిక్ష విధించిన సంఘటన గమనార్హం. కానీ మనదేశంలో ఫ్యాక్టరీ ప్రమాదాల గురించి ఎవరూ అంతగా పట్టించుకోవడం లేదు. ఒకవిధంగా ఈ ప్రమాదాలు సర్వసాధారణమే అన్నట్టు మనం మొద్దుబారిపోయాం. గతవారం వేదాంత బాయిలర్ పేలుడు, ఈ వారం తమిళనాడు, కేరళ బాణాసంచా ఫ్యాక్టరీల్లో పేలుళ్లు జరిగాయి. అయితే అవి బస్సుల దహనాలు, రోడ్డు ప్రమాదాల కన్నా ఎక్కువేం కాదు. బస్సుల ప్రమాదాలు ఏడాదికి వందలాది మందిని బలిగొంటుండగా, రోడ్డు ప్రమాదాలు ఏటా లక్షాఎనభై వేలమంది ప్రాణాలు తీస్తున్నాయి. తమిళనాడు లోని ఓ బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి 17మంది మృతి చెందారు. ఈ ప్రమాదం గురించి మరువక ముందే కేరళ లోని త్రిసూర్ జిల్లాలో ఓ బాణాసంచా ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం సంభవించి 13 మంది కార్మికులు అక్కడికక్కడే మంటల్లో బూడిదయ్యారు. దేశ రాజధాని ఢిల్లీ కూడా కొన్ని పరిశ్రమల ప్రమాదాలకు ప్రత్యక్షసాక్షిగా నిలబడుతోంది. 2019లో ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం సంభవించి 43 మంది స్లీపింగ్ వర్కర్లను పొట్టనపెట్టుకుంది.మన కళ్లల్లో జీవితం చాలా తృణప్రాయం. అందుకనే ఫ్యాక్టరీల్లో ఫైర్ ఎగ్జిట్స్ ఉండడం లేదు. ఎలక్ట్రికల్ సిస్టమ్స్ ఓవర్‌లోడ్ అవుతుంటాయి. బాయిలర్ల నిర్వహణ చాలా అధ్వానం. ఇవన్నీ మనకు నిత్యం ప్రత్యక్ష సాక్షాలే. భద్రతా ప్రమాణాలు పాటించకుండా ప్రమాదకరమైన రసాయనాలను నిల్వ చేస్తుంటారు. భోపాల్ గ్యాస్ దుర్ఘటన తీవ్ర పరిణామాలు మనకు తెలిసిందే. 1984 డిసెంబర్ 23 తేదీల్లో భోపాల్ లోని యూనియన్ కార్బయిడ్ పురుగు మందుల కర్మాగారం నుండి మిథైల్ ఐసోసైనెట్ అనే విషవాయువు లీకై వేలాది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. కంటిచూపు కోల్పోవడం, ఊపిరితిత్తుల వ్యాధులు, క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో దాదాపు 5 లక్షల మంది బాధితులయ్యారు. ఇది ప్రపంచం లోనే అత్యంత ఘోరమైన పారిశ్రామిక విపత్తుగా పరిగణించబడుతోంది. 2020 లో ప్రతి 973 ఫ్యాక్టరీలకు ఒకే ఒక ఇన్‌స్పెక్టర్ ఉండేవారంటే ఫ్యాక్టరీల తనిఖీ ఎలా జరుగుతుందో దీన్ని బట్టి తెలుస్తుంది. దేశ రాజధాని ఆటో అనుబంధ పరిశ్రమల ప్రమాదాలకు పేరు పొందింది.ఈ పరిశ్రమల్లో వర్కర్లకు ఎప్పుడు కాళ్లు, చేతులు తెగిపోవడం, గాయాలవ్వడం పరిపాటి. అయినా ఈ వివరాలేవీ రికార్డుకెక్కవు. తనిఖీలు జరిగేటప్పుడు ఈ చిన్నపాటి ప్రమాదాలు తక్కువగానే జరిగినట్టు రికార్డులు చూపిస్తుంటారు. 2012 నుంచి 2020 వరకు తనిఖీల్లో చాలా తక్కువ సంఖ్యలో ప్రమాదాలు జరిగినట్టు ఆయా యాజమాన్యాలు అధికారులకు రికార్డులు చూపించడం గమనార్హం. ప్రమాదాల వివరాలను దాచిపెట్టడం లేదా బయటపెట్టడానికి ఒప్పుకోకపోవడం చేసినంత కాలం ఫ్యాక్టరీల్లో కార్మికుల సమస్యలకు పరిష్కారం లభించదు. 2017లో ఒక అధ్యయనం ప్రకారం దేశంలో వృత్తిపరమైన ప్రమాదాలు ఏటా 48,000 వరకు జరుగుతున్నాయని తేలింది. ప్రభుత్వం మాత్రం ఈ సంఖ్య కేవలం 1109 మాత్రమే అని చూపించింది. ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికుల్లో 90 శాతం మంది అసంఘటిత కార్మికులే ఉన్నారని చెప్పవచ్చు. పని పరిస్థితుల సంగతి ఇక చెప్పలేం. అధికారిక రంగ కార్మికుల విషయంలో కూడా చాలా ప్రమాదాలను పరిశ్రమల యాజమాన్యాలు సరిగ్గా నమోదు చేయడం లేదు సరికదా ఏదైనా ప్రమాదం జరిగితే పోలీసులు, ఆస్పత్రి వర్గాలు రాజీధోరణి అవలంబించడమే ప్రధాన లక్షంగా వ్యవహరిస్తున్న సంఘటనలు ఉన్నాయి. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఒ) కార్మికుల పాలిట మనదేశం ప్రమాదకరమైన దేశమని ముద్ర వేసింది. ఇకనైనా ఈ అపకీర్తి తుడిచిపెట్టడానికి ఏదో ఒకటి చేయాల్సి ఉంది.

## సాంకేతికతతోనే పారదర్శక సేవలు

దేవరకద్ర : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం దేవరకద్రలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శారీరక వైకల్యం కలిగిన వారు ఎవరిపైనా ఆధారపడకుండా ఆత్మగౌరవంతో జీవించాలనే సంకల్పంతో, ప్రభుత్వం మంజూరు చేసిన త్రీ వీలర్ స్కూటర్లు, ట్రై సైకిళ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగుల సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి ముఖాల్లో చిరునవ్వు చూడటమే తమకు అసలైన సంతృప్తి" అని అన్నారు. అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా దేవరకద్ర, సీసీకుంట, కౌకుంట్ల మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎమ్మెల్యే ఆధునిక 5+ స్మార్ట్‌ఫోన్లను పంపిణీ చేశారు. పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయవచ్చని, సాంకేతికత వల్ల పౌష్టికాహార పంపిణీలో అవినీతికి తావుండదని, క్షేత్రస్థాయి డేటా వేగంగా ప్రభుత్వానికి చేరుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతాయుతంగా పనిచేసి, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

భూత్పూర్, : రైతుల సంక్షేమమే ప్రభుత్వ చేయమని, రైతులు పండించిన ప్రతి వరి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా భూత్పూర్ మండల పరిధిలోని కొత్త మొల్గర, వెలికిచర్ల, భూత్పూర్ మున్సిపాలిటీ పట్టణంలోని కస్తూర్బా గాంధీ స్కూల్ పక్కన వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని అన్నారు. రైతులకి కావలసిన అన్ని మార్కెట్ యార్డులో కల్పించామని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా తమ వడ్లని కొనుగోలు కేంద్రంలోని విక్రయాలు చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి అని, రైతుకు పెట్టుబడి సహాయంగా రెండో విడత రైతుబంధు నిధులు విడుదల చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ మూడవత్ బాలకోటి, కౌన్సిలర్ ప్రేమ్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేసి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ కదిరి శేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిక్కీ నవీన్ గౌడ్, కొత్త మొల్గర గ్రామ సర్పంచ్ వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హర్యానాయక్, తిరుపతి రెడ్డి, పవన్, ఆనంద రెడ్డి తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత గ్రామాల కోసం చర్యలు తీసుకోవాలి

కోనరావుపేట :కోనరావుపేట మండలంలో యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగంపై ఆందోళన వ్యక్తం చేస్తూ లంబాడీల ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు సమస్యను పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ఇంచార్జి బనోత్ నరేష్ నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు డ్రగ్స్కు బానిసలవుతున్న పరిస్థితి తీవ్రంగా ఆందోళన కలిగిస్తోందన్నారు. యువత చెడు అలవాట్లకు లోనవడం వారి భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో పోలీసులు నిరంతర తనిఖీలు నిర్వహించి డ్రగ్స్ సరఫరాను అరికట్టాలని, యువత, విద్యార్థులు, తల్లిదండ్రులకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల ఆరోగ్య సమస్యలు, నేర ప్రవర్తన, విద్యలో వెనుకబడటం వంటి తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకుంటాయని తెలిపారు. యువతను కాపాడేందుకు పోలీసు శాఖ మరియు గ్రామపంచాయతీలు కలిసి డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత గ్రామాలు విద్యార్థుల భవిష్యత్తుకు భద్రత అనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా ఇంచార్జి రాజు నాయక్, తిరుపతి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ నూతన ప్రతిపాదనలకు ట్రంప్ నో



న్యూఢిల్లీ:ఇరాన్ కొత్త ప్రతిపాదనలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తిగా, అసంతోషంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇరుదేశాల సైనిక ఘర్షణకు విడతలవారీగా పరిష్కారాన్ని కనుగొనాలంటూ నూతన ప్రతిపాదనలను ఇటీవలే అమెరికాకు ఇరాన్ సమర్పించింది. శాంతి ఒప్పందం కుదుర్చుకోవడం, హర్మూజ్ జలసంధిని తెరవడం అనేవి జరిగిన తర్వాతే తమ అణ్వస్త్ర కార్యక్రమంపై చర్చలు జరుపుతామని ఇరాన్ తేల్చి చెప్పింది. అణ్వస్త్ర కార్యక్రమంపై ఇరాన్‌తో చర్చలు ఫలప్రదమైన తర్వాతే మిగతా విషయాలపై ఫోకస్ పెడతామని అమెరికా వాదిస్తోంది. ఇరాన్ ప్రతిపాదనలు, అమెరికా వాదనకు పూర్తి భిన్నంగా ఉండటంతో ట్రంప్ వాటిని తోసిపుచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అణ్వస్త్ర కార్యక్రమాన్ని మినహాయించి, ఇరాన్‌తో చర్చలు జరపడంలో అర్థమే ఉండదని అమెరికా ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇరాన్ అణ్వస్త్ర కార్యక్రమాన్ని అడ్డుకోవడం లక్ష్యంగా యుద్ధాన్ని ప్రారంభించినందున, దానిపై తొలుత తమకు ధ్రువీకరణ లభించాలని ట్రంప్ సర్కారు కోరుకుంటోంది. ఇరాన్ పంపిన నూతన ప్రతిపాదనలపై చర్చించేందుకు తన సలహాదారులతో ప్రెసిడెంట్ ట్రంప్ తాజాగా సమావేశమైనట్లు తెలిసింది. అణ్వస్త్ర కార్యక్రమంపై చర్చలు జరగనిదే, మిగతా అంశాలపై ఇరాన్‌తో చర్చలను మొదలుపెట్ట లేమని ట్రంప్ తేల్చి చెప్పినట్లు అధికార వర్గాలు చెప్పాయి. ఇరాన్ ప్రతిపాదించిన క్రమంలో చర్చల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లలేమని అమెరికా ప్రెసిడెంట్ స్పష్టం చేశారని పేర్కొన్నాయి. సోమవారం రోజు ఓ అమెరికన్ మీడియా సంస్థతో మాట్లాడుతూ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా ఇదే విధమైన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ఇక ఏ దశలోనూ అణ్వాయుధాలను అభివృద్ధి చేయలేదని నిర్ధారించే ఒప్పందం కుదరాల్సిందే అని ఆయన తెలిపారు. ఈవిషయంలో ఇరాన్‌కు తప్పించుకునే అవకాశాన్ని ఇవ్వకూడదన్నారు. ఇరాన్ నుంచి దీనిపై అమెరికా ధ్రువీకరణ పొందాలని పేర్కొన్నారు. దీంతో అమెరికా – ఇరాన్ శాంతి చర్చల ప్రక్రియలో మరోసారి ప్రతిష్టంభన ఏర్పడింది. ఇరుదేశాలూ తమతమ షరతుల ప్రకారమే చర్చలు జరగాలని వాదిస్తున్నాయి. వాదనను నెగ్గించుకునే యత్నంలో అమెరికా, ఇరాన్ ఉండటంతో చర్చల ప్రక్రియ ముందుకు సాగే పరిస్థితులు కనిపించడం లేదు. అమెరికాకు ఇరాన్ కొత్తగా చేసిన ప్రతిపాదనల్లో ప్రధానంగా 3 పాయింట్లు ఉన్నాయి. వీటిలో మొదటిది, ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధాన్ని ముగించడం, మళ్లీ ఇరాన్‌పై దాడులు జరగవు అనే హామీలను పొందడం. రెండోది, ఇరాన్ ఓడరేవుల ముట్టడిని అమెరికా ఆపడం, హర్మూజ్ జలసంధిని తెరవడం. మూడోది, మొదటి రెండు పాయింట్లూ అమల్లోకి వచ్చాక తమ అణ్వస్త్ర కార్యక్రమం, సంవర్ధిత యురేనియం హక్కులపై అమెరికాతో చర్చలను మొదలు పెడతామని ఇరాన్ ప్రతిపాదించింది. వాస్తవానికి అమెరికాతో చర్చల కోసం ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాన్ అరాగ్చీ ఏప్రిల్ 24నే పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు చేరుకున్నారు. అయితే అమెరికా తరఫు ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, జేర్డ్ కుష్నెర్‌ల ఇస్లామాబాద్ పర్యటనను అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ ఏప్రిల్ 25న రద్దు చేశారు. దీంతో అమెరికా – ఇరాన్ శాంతి చర్చల ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈనేపథ్యంలో అదే రోజున పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌తో అబ్బాస్ అరాగ్చీ భేటీ అయ్యారు. ఇరాన్ ప్రతిపాదనలను ఆయనకు వివరించారు. వాటిని అమెరికాకు చేరవేయాలని కోరారు. ఇక ఏప్రిల్ 26న అబ్బాస్ అరాగ్చీ ఒమన్‌కు వెళ్లారు. ఒమన్ సుల్తాన్ హైథమ్ బిన్ తారిఖ్ అల్ సైద్‌తో భేటీ అయి, హర్మూజ్ జలసంధి మార్గంలో భద్రతపై చర్చించారు. ఇక ఏప్రిల్ 27న మళ్లీ పాకిస్థాన్‌కు చేరుకొని ఇరాన్ ప్రభుత్వ ప్రతిపాదనలను మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ అధికార వర్గాలకు అందించారు. అక్కడి నుంచి నేరుగా రష్యాకు చేరుకొని, ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్‌తో అరాగ్చీ 90 నిమిషాల పాటు భేటీ అయ్యారు. ఇరుదేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం, అమెరికా – ఇరాన్ యుద్ధంపై వారు చర్చించారు. అనంతరం ఏప్రిల్ 28న మళ్లీ పాక్‌కు అబ్బాస్ అరాగ్చీ చేరుకున్నారు. ప్రస్తుతం ఇరాన్ నూతన ప్రతిపాదనలపై ఆయన అమెరికా ప్రతినిధులతో పరోక్ష చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. పాక్ మధ్యవర్తుల ద్వారా అమెరికా ప్రతినిధులకు సందేశాలను చేరవేస్తున్నట్లు సమాచారం. ఏప్రిల్ 27న న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం వేదికగా అణు నిరాయుధీకరణ ఒప్పందం (ఎన్‌పీటీ)పై 11వ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సదస్సు ప్రారంభోత్సవంలో ఇరాన్ అణ్వస్త్ర ఆశయాల విషయంలో అమెరికా, ఇరాన్ ప్రతినిధుల మధ్య వాగ్వాదం జరిగింది. అలీన ఉద్యమ దేశాల కూటమి తరఫున ఎన్నికైన 34 మంది ఉపాధ్యక్షులలో ఇరాన్ ప్రతినిధి కూడా ఉండటం అనేది ఈ వివాదానికి కేంద్రబిందువుగా నిలిచింది. ఈ నిర్ణయాన్ని అమెరికా, ఆస్ట్రేలియా, యూఏఈ, యూకే, ఫ్రాన్స్, జర్మనీ వ్యతిరేకించాయి. ఎన్‌పీటీ ఒప్పందాన్ని ధిక్కరించిన ఇరాన్‌ను ఉపాధ్యక్ష పదవికి ఎంపిక చేయడం పట్ల అమెరికా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఇరాన్‌ను అమెరికా లక్ష్యంగా చేసుకోవడాన్ని రష్యా తిప్పికొట్టింది. అమెరికా ఆరోపణలు నిరాధారమైనవి, రాజకీయ ప్రేరేపితమైనవని ఇరాన్ రాయబారి రెజా నజాఫీ చెప్పారు.

## కటింగ్‌లు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

సుల్తానాబాద్, : రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారుల పాలు కాకుండా చేస్తూ కిలో కటింగ్ లేకుండా కొనుగోళ్లు చేస్తోంది పెద్దపల్లి నియోజకవర్గంలోనే అని ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు అన్నారు. నారాయణరావుపల్లి, గొల్లపల్లి, సాంబయ్యపల్లి, దుబ్బపల్లి, ఐతురాజుపల్లి, గర్రెపల్లి, బొంతకుంటపల్లి తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రైతులకు చేసేందుకు ఎలాంటి కటింగ్‌లు లేకుండా మిల్లర్ల నుంచి కేంద్రాల నిర్వాహకుల నుంచి రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు జరిపిస్తున్నట్లు వివరించారు. మండలంలో ఇప్పటి వరకు రూ.16 కోట్ల బోనస్ రైతులకు ఇచ్చామన్నారు. గతంలో పది నుంచి పదిహేను కిలలో మేరకూ కటింగ్‌లు చేసిన చరిత్ర ఉందని గుర్తుచేశారు. ప్రభుత్వ నిబందనల మేరకు తేమ శాతం వచ్చేలా రైతులు చూసుకోవాలని, వర్షాలు వచ్చినా ఇబ్బంది లేకుండా అధికారులు అందుబాటులో ఉంటూ కవర్లు ఇస్తారన్నారు. అవసరమైన గన్నీ సంచులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు,ఆయా గ్రామాల సర్పంచులు, వ్యవసాయ అధికారి, కిసాన్ సెల్ అధ్యక్షులు పన్నాల రాములు, చిలుక సతీష్, కల్లెపల్లి జానీ, పదాల అజయ్ తదితరులు పాల్గొన్నారు

# మీ పదేండ్ల అరాచకాల చిట్టా విప్పుదాం రా!




దేవరకద్ర, : నువ్వు నిజాయితీగా ప్రజలకు సేవ చేస్తే నీ పదేండ్ల కాలంలో నువ్వు చేసిన అరాచకాలను చిట్టా విప్పుదాం బహిరంగ చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పై దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి సవాల్ విసిరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్లో ఎమ్మెల్యే మాట్లాడారు. రాజకీయ కక్ష సాధింపులకు కేరాఫ్ అడ్రస్గా మారిన గత పదేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. నియోజకవర్గంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ను అడ్డుకోవాలని చూడటం హీనమైన చర్య అని ఎమ్మెల్యే మండిపడ్డారు. 'చిన్నచింతకుంటలో 25 ఎకరాల భూమి ఎక్కడుందో చూపించండి? కురుమూర్తి జాతర స్థలం భక్తుల అవసరాలకే సరిపోదని, అలాంటి చోట స్కూల్ ఎలా నిర్మిస్తారు?' అని ప్రశ్నించారు. కురుమూర్తి స్వామి ఆలయాన్ని యాదగిరిగుట్ట తరహాలో అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. స్కూల్ నిర్మాణ ప్రాంతంలో తనకు భూమి ఉందన్న ఆరోపణలపై జీఎంఆర్ తీవ్రంగా స్పందించారు. నాకు ఉన్నది కేవలం 5 ఎకరాలే. మీలాగా వందల ఎకరాలు ఆక్రమించలేదని, స్కూల్ స్థలంలో నాకేమైనా సంబంధం ఉందని నిరూపిస్తే ఇప్పుడే రాజీనామా చేస్తానని,నిరూపించలేకపోతే ప్రజలకు క్షమాపణ చెబుతారా?' అని సవాల్ విసిరారు. పెన్షన్లు అడిగినందుకు దళిత కార్యకర్తలపై అట్రాసిటీ కేసులు పెట్టి జైలుకు పంపిన చరిత్ర నీదన్నారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్న వారిపైనే ఉల్టా కేసులు పెట్టించారని, జూనియర్ కాలేజీ మంజూరు చేయాలని కోరినందుకు కార్యకర్తలను పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పిన అహంకారివి నీవు అంటూ విమర్శించారు. తన తమ్ముడిని అనవసరంగా రాజకీయాల్లోకి లాగడం మానుకోవాలని, తాము సేవ చేయడానికి వచ్చామే తప్ప దోచుకోవడానికి కాదని స్పష్టం చేశారు. రాబోయే పదేళ్లూ నేనే ఇక్కడ ఎమ్మెల్యేని. మీరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల ఆశీస్సులు మాకే ఉన్నాయన్నారు. సలహాలు ఉంటే ఇవ్వండి, అభివృద్ధిని అడ్డుకుంటే దేవరకద్ర ప్రజలు మిమ్మల్ని క్షమించరని హెచ్చరించారు. మంచి చేయాలని సంకల్పంతో అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు ఇష్టం సారంగా మాట్లాడితే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోమని విమర్శించారు. నిజంగా నువ్వు చేసింది అభివృద్ధి అయితే నాకు సవాల్ ని స్వీకరించి బహిరంగ చర్చకు రావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, నేతలు నాయకులు ఉన్నారు.

# ఐశ్వర్య... వెంకీ తర్వాత నాగార్జునతో?



తన వందో సినిమాను చడీ చప్పుడు లేకుండా మొదలుపెట్టి.. చకచకా పూర్తి చేసేస్తున్నాడు టాలీవుడ్ సీనియర్ హీరో అక్కినేని నాగార్జున. ఈ సినిమాకు దర్శకుడిగా ముందు ఏవేవో పేర్లు వినిపించగా.. చివరికి తమిళ యంగ్ డైరెక్టర్ రా.కార్తీక్‌ను ఎంచుకుని, సొంత బేనర్లో ప్రొడ్యూస్ చేస్తున్నాడు నాగ్. ఇది అభిమానులకు విందు భోజనం లాంటి సినిమా అని.. ఇందులో యాక్షన్‌తో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఉంటాయని నాగ్ గతంలో చెప్పిన సంగతి తెలిసిందే.ఈ సినిమాలో నాగ్ భిన్న అవతారాల్లో కనిపించబోతున్నాడు. ఆయన సరసన ఏకంగా ముగ్గురు హీరోయిన్లు నటించబోతున్నారట. అందులో ఒకరు సీనియర్ హీరో టబు అని ఇంతకుముందే వార్తలు వచ్చాయి. నిన్నే పెళ్ళాడతా, ఆవిడా మా ఆవిడే లాంటి చిత్రాలతో ఎవర్ గ్రీన్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్న నాగ్, టబు ఇన్నేళ్ల తర్వాత మళ్లీ కలిసి తెరపై కనిపించబోతుండడం నిన్నటి తరం ప్రేక్షకులకు నోస్టాల్జిక్ ఫీల్ ఇస్తుందనడంలో సందేహం లేదు.ఇక ఈ చిత్రంలో మరో హీరోయిన్‌గా ఐశ్వర్యా రాజేష్ ఖరారైందన్నది తాజా సమాచారం. ఈ తెలుగమ్మాయి తమిళంలో స్టార్ హీరోయిన్ అయ్యాక తెలుగులో నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తోంది. గత ఏడాది సంక్రాంతికి వస్తున్నాంలో వెంకీకి జోడీగా నటించింది ఐశ్వర్య. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయినప్పటికీ.. ఐశ్వర్యకు తెలుగులో ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదు.ఇప్పుడు వెంకీ తరం సీనియర్ హీరో అయిన నాగ్ సరసన ఆమెకు ఛాన్స్ దక్కింది. ఈ చిత్రంతో సుస్మితా భట్ అనే మరో హీరోయిన్ కూడా నటిస్తోంది. ఈ తమిళ అమ్మాయి.. గతంలో తెలుగులో నాట్యం అనే క్లాసికల్ డ్యాన్స్ నేపథ్యంలో సాగే సినిమాలో లీడ్ రోల్ చేసింది. ఈ వయసులోనూ నాగ్ ముగ్గురు హీరోయిన్లతో జట్టు కడుతుండడం విశేషమే.ఈ వేసవికల్లా నాగ్ వందో సినిమా చిత్రీకరణ పూర్తవుతుంది. నాగ్ పుట్టిన రోజు అయిన ఆగస్టు 29న ఈ చిత్రాన్ని విడుదల చేసే ఆలోచనలో ఉందట టీమ్. ఇప్పటిదాకా ఈ సినిమా గురించి అధికారికంగా ప్రకటించలేదు. ఏ విశేషాన్నీ పంచుకోలేదు నాగ్ బృందం.

# అక్కినేని అభిమానులు హ్యాపీ కాదా?



సోషల్ మీడియా ట్రెండ్స్ చూస్తుంటే పై ప్రశ్నకు ఔననే సమాధానం వస్తుంది. లెనిన్ కొత్త విడుదల తేదీని జూన్ 26కి ప్రకటించడంతో ఒక్కసారిగా అక్కినేని అభిమానులు భగ్గుమంటున్నారు. వాళ్ళ ఆగ్రహానికి కారణం లేకపోలేదు. లెనిన్ మే 1 వస్తుందని ముందు నుంచి బలంగా నమ్మారు. ఇప్పుడు పెద్ది ఏప్రిల్ 30 వస్తుంది కాబట్టి దాని కోసం త్యాగం చేశామనే రీతిలో నిర్మాతలు వివరణ ఇవ్వడంతో వాళ్లకు కన్విన్సింగ్ గా అనిపించడం లేదు. ఎందుకో చూద్దాం.లెనిన్ ఇంకొంత భాగం పెండింగ్ ఉంది. ఇదేమి విజువల్ గ్రాండియర్, విఎఫ్ఎక్స్ ఎక్కువగా ఉన్న మూవీ కాదు కాబట్టి షూటింగ్ కు ఎక్కువ టైం అవసరం లేదు. సరే పెద్ది కోసం పోస్ట్ పోన్ చేశారని అనుకున్నా దానికి రెండు నెలల గ్యాప్ ఎందుకనేది అసలు క్వశ్చన్. పెద్ది బ్లాక్ బస్టర్ అయినా సరే మహా అయితే నెల రోజుల కంటే ఎక్కువ థియేటర్ రన్ ఉండదని, ఎలాగూ నాలుగు వారాల ఓటిటి అగ్రిమెంట్ చేసుకుని ఉంటారు కాబట్టి జూన్ మొదటివారానికి డిజిటల్ లో వచ్చేస్తుందని అఖిల్ ఫ్యాన్స్ భావిస్తున్నారు.అలాంటప్పుడు లెనిన్ మే మధ్యలోనో చివరి వారంలోనో వదలకుండా ఇంత జాప్యం చేస్తూ, పైగా పెద్దిని సాకుగా చూపిస్తారా అంటూ నిలదీస్తున్నారు. సితార బ్యానర్ లో చాలా సినిమాలు ఇలా వాయిదాల పర్వంలో నలిగినవే. అయితే అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యం ఉంది కాబట్టి నాగార్జున ఎక్కువ డిలే లేకుండా చూస్తారని భావించారు. కానీ ఆయన కూడా ఏం చేయలేని పరిస్థితిలో ఉండిపోయారని సిచువేషన్ చూస్తే అర్థమైపోతుంది.వినరో భాగ్యము విష్ణుకథ ఫేమ్ మురళికిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించిన లెనిన్ లో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటించగా తమన్ సంగీతం సమకూరుస్తున్నారు. రఫ్ పల్లెటూరి లుక్ లో అఖిల్ కొత్తగా ఉన్నాడు. ఆల్రెడీ రిలీజైన పాట మంచి బజ్ తెచ్చుకుంది. జూన్ మొదటి వారంలో టాక్సిక్ లాంటి ప్యాన్ ఇండియా మూవీస్ ఉన్నాయి కాబట్టే లెనిన్ ని కాస్త దూరం తీసుకెళ్లాల్సి వచ్చిందని ప్రొడక్షన్ హౌస్ టాక్. ఏది ఏమైనా లెనిన్ బ్లాక్ బస్టర్ అవ్వాలనేది అందరి కోరిక.

# మెరుగుపడిన యూకో బ్యాంక్ ఆర్థిక ఫలితాలు

హైదరాబాద్, ఏప్రిల్ 27(విజయక్రాంతి): తక్కువ కేటాయింపులు, ఆస్తుల నాణ్యత మె రుగుదలల కారణంగా, యూకో బ్యాంక్ 2026 మార్చి 31తో ముగిసే 2025 ఆర్థిక సంవత్సరానికి, నాల్గవ త్రైమాసికానికి బలమైన ఫలితాలను నివేదించింది. మార్చి 31, 2026 నాటికి బ్యాంకు మొత్తం వ్యాపా రం రూ.5,90,314 కోట్లకు పెరిగింది, ఇది గతేడాదితో పోలిస్తే 14.95% వృద్ధిని సూచిస్తుంది.ఇందులో రూ.2,62,752 కోట్ల స్థూ ల అడ్వాన్సులు (19.44% పెరుగుదల), రూ.3,27,563 కోట్ల మొత్తం డిపాజిట్లు (11.59% పెరుగుదల) ఉన్నాయి. కాసా డిపాజిట్లు కూడా రూ.1,17,752 కోట్లకు పెరిగాయి, అదే సమయంలో కాసా నిష్పత్తి 38. 65%కి మెరుగుపడింది.మార్చి 2026 త్రై మాసికానికి బ్యాంకు నికర లాభం రూ.801 కోట్లుగా నమోదైంది, ఇది గత ఏడాది ఇదే కాలంలోని రూ.653 కోట్ల కంటే 22.66% అధికం. నిర్వహణ లాభం రూ.1,573 కోట్లుగా నమోదైంది.రుణాల విభాగంలో, రిటైల్, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ విభాగాలలో బ్యాంకు అడ్వాన్సులు 24.23% పెరిగి రూ. 1,52,324 కోట్లకు చేరాయి.ఇందులో రిటైల్ రుణాలు 26.62%, వ్యవసాయ రుణాలు 26.24%, ఎంఎస్ఎంఈ రుణాలు 19.36% వృద్ధిని సాధించాయి. ఇందులో రిటైల్ రు ణాలు 26.62%, వ్యవసాయ రుణాలు 26.24%, మరియు ఎంఎస్ఎంఈ రుణాలు 19.36% వృద్ధిని సాధించాయి. స్థూల ఎన్పిఏ 2.17%కి, నికర ఎన్పిఏ 0.27%కి త గ్గడంతో బ్యాంకు ఆస్తుల నాణ్యత మెరుగుపడింది.మూలధన పర్యాప్త నిష్పత్తి 18.61%గా ఉండగా, టైర్-1 మూలధన నిష్పత్తి 16.59%గా ఉంది. 2025 పూర్తి ఆర్థిక సంవత్సరానికి, బ్యాంకు నికర లాభం 13.21% పెరిగి రూ.2,768 కోట్లకు చేరగా, నిర్వహణ లాభం 6.49% పెరిగి రూ. 6,429 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదా యం 10,197 కోట్లుగా నమోదైంది, ఇది 5.89% వృద్ధిని సూచిస్తుంది.వాటాదారుల ఆమోదానికి లోబడి, బ్యాంకు 4.40% (ఒక్కో షేరుకు 0.44) డివిడెండ్‌ను ప్రతిపాదించింది. 2026 మార్చి 31 నాటికి, బ్యాంకుకు 3,412 దేశీయ శాఖలు, 2 విదేశీ శాఖలు (హాంకాంగ్ , సింగపూర్‌లో), అలాగే ఇరాన్లో ఒక ప్రతినిధి కార్యాలయం ఉన్నా యి. మొత్తంమీద, 2025-26 ఆర్థిక సంవత్సరంలో యూకో బ్యాంక్ పనితీరు బలంగా ఉంది.

# 110 డాలర్లకు చేరువలో క్రూడాయిల్..



హైదరాబాద్:అంతర్జాతీయమార్కెట్ లో క్రూడాయిల్ ధర 110 డాలర్లకు చేరువలో ఉంది. సోమవారం మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 107 డాలర్లకు చేరుకున్నది. పశ్చిమాసియాలో పరిస్థితులు ఇలాగే కొనసాగితే 110 డాలర్లు దాటిపోతుందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. భారత్ లాంటి దేశాలు ఈ ధరల పెరుగుదలతో ఆర్థికంగా అనేక ఆటుపోట్లకు గురికాక తప్పదని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. ద్రవ్యోల్బణంతోపాటు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు అమాంతం పెరగడం, రూపాయి విలువ పడిపోవడం, ప్రభుత్వ ఆయిల్ కంపెనీల లాభాల్లో భారీ క్షీణత, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి తారుమారు అవుతుందంటున్నారు. ఆ కారణాలు ఏంటో ఒకసారి తెలుసుకుందాం.నిన్న మొన్నటి వరకు క్రూడాయిల్ బ్యారెల్ ధర రెండంకెలకు పరిమితం కాగా సోమవారం అంతర్జాతీయ మార్కెట్‌లో మూడు అంకెలు అనగా 107 డాలర్లకు చేరుకున్నది. గతంలో వంద డాలర్లకు చేరువ అవుతున్న సందర్భంలో వ్యాపారులు తీవ్ర ఆందోళకు గురయ్యారు. భారత దేశంలో వినియోగించే ఇంధన ఉత్పత్తుల్లో 85 శాతం పశ్చిమాసియా దేశాల నుంచే దిగుమతి అవుతుంటాయి. పెరుగుతున్న క్రూడాయిల్ ధరలు దిగుమతులపై ఆర్థికంగా ప్రభావం చూపించనున్నాయి. క్రూడాయిల్ బ్యారెల్‌పై 10 డాలర్లు పెరిగితే భారత్‌లో ఆర్థికంగా ఒడిదుడుకులు ఎదురు కావడంతో పాటు డాలర్ రూపంలో చెల్లింపులు పెరుగుతాయి. 90 డాలర్ల నుంచి 110 డాలర్లకు పెరగడం మూలంగా కేంద్ర ప్రభుత్వంపై ఆర్థిక భారంతో పాటు ఒత్తిడి రెట్టింపు అవుతుంది. దిగుమతుల బిల్లులు పెరగడం మూలంగా ఆ భారాన్ని ప్రజలపై వేయడం తప్ప మరో ప్రత్యామ్నాయ మార్గం ప్రభుత్వానికి లేకుండాపోయింది.క్రూడాయిల్ ధరలు పెరిగినప్పటికీ, నాలుగు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికల కారణంగా కేంద్ర ప్రభుత్వం దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచకుండా పాత ధరలనే కొనసాగించడం విశేషం. ధరల పెంపుదలలో తమ ప్రమేయం లేదని బయటకు చెబుతున్నప్పటికీ, అంతర్గతంగా ఆయిల్ కంపెనీలను నియంత్రించారనే విమర్శలు ఉన్నాయి. దేశంలో ధరల పెరుగుదల క్రూడ్ పైనే కాకుండా శుద్ధి చేయడం, విదేశీ మారకం, ప్రభుత్వ పాలసీలపై ఆధారపడి ఉంది. ఇప్పటికిప్పుడు ఈ ధరల పెరుగుదల ప్రజలపై ప్రభావం చూపనప్పటికీ, దీర్ఘకాలికంగా తీవ్ర ఒత్తిడి, వేదనకు గురి చేస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.క్రూడాయిల్ ధరల పెరుగుదలతో ఎక్కువ మొత్తంలో డాలర్లతో చెల్లించడం మూలంగా రూపాయి పై ప్రభావం చూపిస్తుంది. విలువ తగ్గడంతో ప్రపంచ పెట్టుబడిదారులు పునరాలోచనలో పడతారు. రూపాయి క్షీణతతో దిగుమతి చేసుకుంటున్న క్రూడాయిల్ ధర ఖర్చు పెరుగుతుంది. క్రూడాయిల్ ధరలు పెరిగినప్పుడల్లా క్రూడ్, కరెన్సీ లింక్ విడదీయని విధంగా తయారైందని ప్రపంచ ఆర్థికవేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు.అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ధర పెరుగుదల మూలంగా కొన్ని రంగాలపై స్వల్పంగా, మరికొన్ని రంగాలపై పెద్ద ఎత్తున ప్రభావం చూపిస్తుంది. విమానాలలో ఉపయోగించే జెట్ ఫ్యూయల్ ధరలు పెరుగుతాయి. పెయింట్ కంపెనీలు, కెమికల్ కంపెనీల లాభాల్లో క్షీణత తప్పదు. టైరు తయారీదారులు, లాజిస్టిక్ కంపెనీలు ఆదాయంపై గణనీయమైన ప్రభావం చూపిస్తుంది. రష్యా ఉక్రెయిన్ యుద్ధం కారణంగా 2022 లో క్రూడాయిల్ ధరలు 110 డాలర్లకు చేరుకున్నది. ఆ సంవత్సరం ప్రపంచ మార్కెట్ లో ద్రవ్యోల్బణం ఏర్పడింది. సెంట్రల్ బ్యాంకు ఊహించని విధంగా ఆర్థిక లావాదేవీలపై పన్నులు పెంచడంతో ప్రపంచ మార్కెట్లు కుదుపునకు గురయ్యాయి. అయితే 2022 నాటి పరిస్థితులు మళ్లీ వస్తాయని కాదు కాని క్రూడ్ ధర 110 డాలర్లకు చేరుకుంటుందంటే సీరియస్‌గా తీసుకోవాల్సిన అంశమని చెబుతున్నారు.క్రూడాయిల్ ధరల పెరుగుదల, లాభాల్లో క్షీణత వంటి కారణాలతో తెలంగాణ, ఏపీతో పాటు మరికొన్ని రాష్ట్రాలలో ఆయిల్ కంపెనీలు సరఫరాలో భారీ కోత విధించాయి. దీంతో బంకు యజమానులు నిర్ణీత సమయంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయలేకపోతున్నారు. ఫలితంగా రెండు రాష్ట్రాలలో బంకుల ముందు వాహనాలు బారులు తీరుతున్నాయి. ఒకప్పుడు ఎల్పీజీ ఆటోలు బంకుల ముందు క్యూ కట్టగా, ఇప్పుడు పెట్రోల్, డీజిల్ వాహనదారులు వరుసలో ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆయిల్ కంపెనీలను నియంత్రించడంలో తెలంగాణ పౌర సరఫరాల విభాగం పూర్తిగా విఫలం అయ్యిందని వాహనదారులు దుమ్మెత్తిపోస్తున్నారు. ఆయిల్ కంపెనీలు సరఫరాలో కోత విధిస్తుంటే పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏం చేస్తున్నారంటూ పలువురు వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

# ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు




న్యూఢిల్లీ:రిటైర్మెంట్ కోసం డబ్బు దాచుకోవాల్సిన అవసరం లేదని ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2030 నాటికల్లా ఏఐ మానవ మేధస్సును మించిపోతుందని, రోబోల వల్ల వస్తువుల ఉత్పత్తి పెరిగి కొరత లేని ప్రపంచం ఏర్పడుతుందని ఆయన విశ్వసిస్తున్నారు. పని అనేది ఒక 'ఆప్షన్'గా మారుతుందని, డబ్బుకు విలువ ఉండదని మస్క్ చెబుతున్నారు.సాధారణంగా ఆర్థిక నిపుణులు ఇచ్చే మొదటి సలహా 'రిటైర్మెంట్ కోసం పొదుపు చేయండి' అని. కానీ ఎలాన్ మస్క్ దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మస్క్ మాట్లాడుతూ, రాబోయే 10 నుండి 20 ఏళ్లలో డబ్బు దాచుకోవడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు. కృత్రిమ మేధ రోబోటిక్స్ రంగంలో వస్తున్న 'సూపర్‌సోనిక్ సునామీ' వల్ల ప్రపంచంలో వస్తువుల కొరత అనేది ఉండదని, ప్రతిదీ అపారంగా లభిస్తుందని ఆయన అంచనా వేశారు. 2030 నాటికల్లా ఏఐ అనేది ప్రపంచంలోని మనుషులందరి ఉమ్మడి మేధస్సు కంటే శక్తిమంతంగా మారుతుందని ఆయన చెబుతున్నారు.మస్క్ ఊహించిన ప్రపంచంలో యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ కంటే మించి యూనివర్సల్ హై ఇన్‌కమ్(మీకు నచ్చినది ఏదైనా పొందే ఆదాయం) అందుబాటులోకి వస్తుంది. సాధారణంగా మనం బతకడానికి పని చేస్తాం, కానీ భవిష్యత్తులో పని అనేది కేవలం ఒక అభిరుచిగా మారుతుందని మస్క్ అభిప్రాయపడ్డారు. ఉదాహరణకు, మార్కెట్లో కూరగాయలు దొరికినప్పటికీ, కొందరు సరదా కోసం ఇంట్లో తోట పెంచుకున్నట్లే.. రోబోలు అన్ని పనులు చేసినప్పటికీ మనుషులు తమ ఇష్టానికి అనుగుణంగా పనులు చేసుకోవచ్చని ఆయన వివరించారు. ముఖ్యంగా వైట్ కాలర్ ఉద్యోగాలన్నీ ఏఐ చేతిలోకి వెళ్తాయని, తద్వారా ఉత్పత్తి ఖర్చులు తగ్గి వస్తువులు, సేవలు దాదాపు ఉచితంగా లేదా అతి తక్కువ ధరకే లభిస్తాయని ఆయన అంచనా వేస్తున్నారు.డబ్బు, సేవింగ్స్ జీవన ప్రమాణాల మధ్య ఉన్న సంబంధం భవిష్యత్తులో అర్థరహితంగా మారుతుందని మస్క్ అంటున్నారు. రాబోయే 5 ఏళ్లలో ఏఐ సాయంతో ప్రస్తుతం ఉన్నదాని కంటే మెరుగైన వైద్యం ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వస్తుంది. విద్యపై ఎటువంటి పరిమితులు ఉండవు. హ్యూమనాయిడ్ రోబోలు మనుషుల కంటే ఎక్కువ సంఖ్యలో ఉంటాయని, అవి ఫ్యాక్టరీల్లో రేయింబవళ్లు పనిచేస్తూ వస్తువుల ఉత్పత్తిని ఊహించని స్థాయికి తీసుకెళ్తాయని మస్క్ జోస్యం చెప్పారు. దీనివల్ల వస్తువుల ధరలు పడిపోయి, డబ్బుతో సంబంధం లేకుండా అవసరాలన్నీ తీరుతాయని ఆయన అంటున్నారు.అయితే ఈ వింత ప్రపంచం వల్ల కొన్ని ప్రతికూలతలు కూడా ఉన్నాయని మస్క్ హెచ్చరించారు. పని చేయాల్సిన అవసరం లేనప్పుడు మనుషుల్లో జీవిత పరమార్థం(జతీఱంఱం శీట ఎమ్ఖఅఱఅస్త్ర) కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతా ఉచితంగా దొరికినప్పుడు సమాజంలో అశాంతి కలిగే అవకాశం కూడా ఉందని ఆయన అన్నారు. మరోవైపు, ప్రస్తుతం అమెరికా వంటి దేశాల్లో ద్రవ్యోల్బణం వల్ల చాలామంది అత్యవసర నిధి కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి తరుణంలో మస్క్ వ్యాఖ్యలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, వాస్తవ రూపం దాల్చడానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది.

# కొండెక్కిన 'కోడి గుడ్ల' ధరలు..

హైద్రాబాద్: అటు చికెన్, ఇటు మటన్ తినలేని వారంతా.. కోడిగుడ్ల వైపు మొగ్గు చూపిస్తారు. అంటే మధ్య తరగతి, దిగువ తరగతి కుటుంబాలకు చెందిన వారంతా కోడిగుడ్లను తింటుంటారు. ఎందుకంటే కోడిగుడ్డు ధర తక్కువగా ఉండడమే కారణం. కానీ గత వారం రోజుల నుంచి కోడిగుడ్ల ధరలు కొండెక్కుతున్నాయి. పది రోజుల్లోనే ఒక్కో కోడిగుడ్డు ధర రూ. 3 మేర పెరిగింది. దీంతో సామాన్యుడి జేబుకు చిల్లు పడుతుంది.దాదాపు రెండు వారాల క్రితం ఒక్కో కోడిగుడ్డు ధర రూ. 4 ఉండగా, ఇప్పుడు రిటైల్ మార్కెట్‌లో ఒక్కో కోడిగుడ్డు ధర రూ. 7కు చేరింది. అయితే రిటైల్ దుకాణాల్లో కోడిగుడ్ల ధరలు ఒకే విధంగా ఉండగా, హోల్ సేల్ దుకాణాల్లో మాత్రం ఒక్కో కోడిగుడ్డు ధర రూ. 6.30 చొప్పున విక్రయిస్తున్నారు.కోడిగుడ్ల ధరల పెరుగుదలకు కారణం.. కేవలం భారీగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలే కారణమని పౌల్ట్రీ నిర్వాహకులు చెబుతున్నారు. భారీ ఉష్ణోగ్రతల నేపథ్యంలో.. కోళ్లు కూడా మరణానికి గురవుతున్నాయని, ఈ క్రమంలోనే కోడిగుడ్ల ధరలు ఆకాశాన్నంటాయని పేర్కొన్నారు. కోళ్లు మరణిస్తుండడంతో ఉత్పత్తి కూడా తక్కువగా ఉందన్నారు. అయినా కూడా కోడిగుడ్లకు డిమాండ్ భారీగానే ఉంది. సరఫరా తక్కువగా ఉండడంతో.. నష్టాలను పూడ్చుకోవడానికి కోడిగుడ్ల ధరలను పెంచాల్సి వస్తుందని ఓ కోళ్లఫారం యజమాని తెలిపారు.ఈ వేసవిలో కోళ్ల మరణాల రేటు 30 శాతం ఎక్కువగా ఉందని తెలిపారు. ఇక కిలో చికెన్ ధర రూ. 240 ఉండగా, లైవ్ కోడిని రూ. 170కి విక్రయిస్తున్నారు. మొత్తంగా రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పౌల్ట్రీ ఫారాలపై తీవ్ర ప్రభావం నెలకొంది.

# ఇంజినీరింగ్ ఎగుమతులకు యుద్ధం దెబ్బ

ముంబయి : పశ్చిమాసియాలో అమెరికా యుద్ధోన్మాదం భారత ఇంజినీరింగ్ ఎగుమతులను తీవ్రంగా దెబ్బతీశాయి. ఇరాన్‌పై చేస్తోన్న దాడులతో షిప్పింగ్ మార్గాల మూసివేత కారణంగా భారత ఇంజినీరింగ్ ఎగుమతులు తీవ్రంగా పడిపోయాయి. ముఖ్యంగా భారత్‌కు రెండో అతిపెద్ద మార్కెట్ అయిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు ఈ ఏడాది మార్చిలో ఎగుమతులు ఏకంగా 66.8 శాతం క్షీణించి 237.4 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. సౌదీ అరేబియాకు చేసే ఎగుమతులు కూడా 45 శాతం పతనమై 247.7 మిలియన్ డాలర్లకు పడిపోయాయి. యూఏఈ ప్రధాన వాణిజ్య కేంద్రం కావడంతో అక్కడి గోదాముల ద్వారా ఇతర దేశాలకు జరిగే వ్యాపార కార్యకలాపాలపై ఈ భౌగోళిక ఉద్రిక్తతలు కోలుకోలేని దెబ్బ తీశాయి. ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాలకు జరుగుతున్న ఎగుమతులు కొంత ఆశాజనకంగా నమోదయ్యాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం 2025-26లో మొత్తం ఇంజినీరింగ్ ఎగుమతులు 4.86 శాతం పెరిగి 122.43 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. మొత్తం వస్తువుల ఎగుమతుల్లో ఇంజనీరింగ్ రంగం వాటా 27.71 శాతానికి పెరగడం విశేషం. అమెరికాకు ఎగుమతులు 2.3 శాతం పెరిగి 19.6 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వీటితో పాటు జర్మనీ (14.6 శాతం), బ్రిటన్ (18.2 శాతం), చైనా (32.4 శాతం), దక్షిణ కొరియా (16.7 శాతం) వంటి దేశాల్లో భారత ఉత్పత్తులకు డిమాండ్ భారీగా పెరిగింది. ముఖ్యంగా ఆటోమొబైల్ రంగం ఇంజినీరింగ్ ఎగుమతుల్లో సింహభాగాన్ని ఆక్రమించింది. ఇందులో కార్లు, ద్విచక్ర వాహనాల ఎగుమతులు 23 నుంచి 24 శాతం వరకు వృద్ధితో మద్దతును అందించాయి. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి భవిష్యత్తులో కూడా కొంత ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తోన్నాయి.

# పాఠశాలల్లో న్యాయ విద్య

న్యూఢిల్లీ:రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థుల్లో న్యాయ అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వారి హక్కులు, బాధ్యతలు, రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ న్యాయసేవా సంస్థ, పాఠశాల విద్యాశాఖ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. న్యాయసేవా సంస్థ కార్యాలయంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సమ్‌కోషి సమక్షంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయసేవా సంస్థ సభ్య కార్యదర్శి సీహెచ్.పంచాక్షరి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్, అదనపు కార్యదర్శి లింగయ్య పాల్గొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, జడ్పీ, గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో న్యాయ విద్యపై విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తారు. బాలల హక్కులు, బాల్య వివాహాలు, బాలకార్మిక చట్టాలు, ప్రాథమిక హక్కులు, బాధ్యతలపై ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తారు. అలాగే ప్రతి పాఠశాలలో బాలల సంరక్షణ అధికారిగా ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తారు. అన్ని బడుల్లో లీగల్ లిటరసీ క్లబ్‌లు, చైల్డ్ రైట్స్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని బడుల్లో దీన్ని అమలుచేస్తామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్ తెలిపారు.అన్నారు.

# ఆధునిక సాగుతోనే రైతుల అభివృద్ధి

ఖమ్మం, : ఆధునిక వ్యవసాయ పద్ధతులతోనే రైతులు అధిక ఆదాయం, అభివృద్ధి సాధిస్తారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామస్థాయికి వెళ్లి తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధించేలా రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. ఈ విషయంలో శాస్త్రవేత్తలు నిరంతరం శ్రమించాలని, రైతులు ఏ భూమిలో ఏ పంట వేయాలి? ఎంత ఎరువు వేయాలి? తదితర అంశాలను వివరించాలని చెప్పారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండల రైతు వేదిక నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని తుమ్మల ప్రారంభించారు. వచ్చే సీజన్‌లో ఖమ్మం జిల్లాలో గోద్రేజ్ ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ప్రారంభమవుతుందని, ఇక్కడే ఆయిల్‌పామ్ నర్సరీ స్థాపించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి నిధులు కేటాయించలేదని, కానీ తమ ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని తెలిపారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విద్యాలయం నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు రైతులకు అధునాతన సాగు విధానాలపై అవగాహన కల్పించారు.

# అపోలో 76వ స్మార్ట్ హాస్పిటల్ ప్రారంభం



హైదరాబాద్, : దేశంలో ఆరోగ్య సేవలను మరింత విస్తరించేందుకు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ మరో కీలక అడుగు వేసింది. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్లో 400 పడకల సామర్థ్యంతో నిర్మించిన 76వ స్మార్ట్ హాస్పిటల్ను ప్రారంభించింది. ఈ ఆసుపత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా కూడా పాల్గొన్నారు. 10 అంతస్తుల ఈ స్మార్ట్ హాస్పిటల్ ఆధునిక సాంకేతికతతో రూపుదిద్దుకుని, అత్యవసర సేవలు, మల్టీ-స్పెషాలిటీ వైద్యం, వేగవంతమైన చికిత్సకు అనుకూలంగా రూపొందించ బడింది. కనెక్టెడ్ అంబులెన్స్ సేవలు, డిజిటల్ కేర్ వ్యవస్థలు, రియల్టైమ్ వైద్య సమన్వ యం వంటి సౌకర్యాలతో రోగులకు తక్షణ సేవలు అందించనుంది. తల్లి-శిశు సంరక్షణ, వృద్ధులకు ప్రత్యేక సేవలు, అంతర్జాతీయ రోగులకు ప్రత్యేక కార్యక్రమాలు కూడా అం దుబాటులో ఉంటాయి. అపోలో ఆసుపత్రుల వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి మాట్లాడుతూ, దేశంలో అత్యాధునిక వైద్య సాంకేతికతలను, నిరోధక ఆరోగ్య సేవలను అందించాలన్న లక్ష్యంతో తమ ప్రయా ణం కొనసాగుతోందన్నారు. వైద్య రంగంలో నాణ్యతతో పాటు, అందుబాటు ధరల్లో సేవ లు అందించగల సామర్థ్యం భారతదేశానికి ఉందని విశ్వసిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య సేవలు కొంతమందికి మాత్రమే పరిమితమై న ప్రత్యేక హక్కుగా కాకుండా, ప్రతి ఒక్కరూ నమ్మకంగా ఆశ్రయించగల హామీగా మారాలన్నారు. ప్రతి కొత్త ఆసుపత్రి ద్వారా ఆ లక్ష్యాన్ని మరింత చేరువ చేస్తున్నామని, ప్ర పంచానికి వైద్యం మాత్రమే కాదు, మానవతలో కూడా భారత్ ముందంజలో నిలిచే భవిష్యత్తును నిర్మిస్తున్నామన్నారు. అపోలో ఆసుపత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్లో ఏర్పాటు చేసిన స్మార్ట్ హాస్పిటల్ ద్వారా తదుపరి తరం ఆరోగ్య వ్యవస్థల నిర్మాణంలో భారతదేశం నాయకత్వాన్ని మరింత బలపరుస్తున్నామన్నారు. నిర్ధారణ నుంచి కోలుకునే దశ వరకు ప్రతి స్థాయిలో ఆధునిక సాంకేతికతను సమగ్రంగా అమలు చేసి, వైద్య నైపు ణ్యాన్ని సమన్వయం చేస్తున్నామన్నారు. ఈ సదుపాయం ద్వారా క్లిష్ట వైద్య చికిత్సలకు హైదరాబాద్ను గ్లోబల్ కేంద్రం గా మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రతి పౌరుడికి ప్రపంచ స్థాయి వైద్య సేవలను సులభంగా అందుబాటులోకి తీసుకు వస్తా మన్నారు. సీఎస్ఆర్ విభాగం వైస్ చైర్పర్సన్ ఉపాసన కామినేని కొణిదెల నానక్ రామ్గూడ ప్రాంత ప్రజలకు ప్రతి ఆదివారం 10వేలు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వ హించనున్నట్లు ప్రకటించారు. ప్రాంతీయ సీఈఓ తేజస్వి వీరేపల్లి మాట్లాడుతూ, ఇది కేవలం ఆసుపత్రి కాదు, భవిష్యత్ ఆరోగ్య వ్యవస్థ. 'గోల్డెన్ అవర్'లో చికిత్స అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నా మన్నారు.

# తెలంగాణలో కొత్త భవన నియమావళి



హైద్రాబాద్: భవన నిర్మాణ రంగం సరికొత్త మలుపు తిరగబోతోంది. ప్రస్తుతం ఉన్న భవన నిర్మాణ నిబంధనలను హేతుబద్ధీకరించి, సరళీకృతం చేసే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఏకీకృత భవన నియమావళికి రూపకల్పన చేస్తోంది. ఇందుకోసం హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (ఎవీణూ) ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. రాబోయే 3 నుంచి 5 నెలల్లో ఈ కొత్త నిబంధనలను అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కొత్త కోడ్ తయారీ కోసం అధికారులు ఢిల్లీ, ముంబై, చండీగఢ్, నయా రాయ్పూర్ వంటి భారతీయ నగరాలతో పాటు పలు అంతర్జాతీయ నగరాల్లో అమల్లో ఉన్న నిబంధనలను లోతుగా అధ్యయనం చేశారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ, డీటీసీపీ పరిధిలో భవన నిర్మాణ అనుమతుల విధానం వేర్వేరుగా ఉంది. కొత్త నిబంధనల ప్రకారం.. ఈ రెండు విభాగాల అనుమతుల విధానాన్ని ఏకీకృతం చేయనున్నారు. అంటే రాష్ట్రవ్యాప్తంగా లేఅవుట్లు, ఓపెన్ స్పేస్, సెట్బ్యాక్, అంతర్గత రోడ్లు, పార్కింగ్ వంటి మౌలిక వసతుల కల్పనలో ఒకే రకమైన ప్రామాణిక విధానం అమల్లోకి వస్తుంది. ముంబైలో అమల్లో ఉన్న ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్, ఢిల్లీలో ఉన్న ఫ్లోర్ ఏరియా రేషియో వంటి పద్ధతులను ఇక్కడ కూడా ప్రవేశపెట్టేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. దీనివల్ల బిల్డర్లకు, సామాన్య ప్రజలకు నిర్మాణ వ్యయంపై ముందస్తు అంచనా రావడమే కాకుండా పారదర్శకత పెరుగుతుంది. ఈ కొత్త నియమావళిలో అత్యంత కీలకమైన అంశం వర్టికల్ మిక్స్ విధానం. ప్రస్తుతం బహుళ అంతస్తుల వాణిజ్య భవనాల్లో కేవలం వ్యాపార కార్యకలాపాలకు మాత్రమే అనుమతి ఉంది. దీనివల్ల గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ మినహా మిగతా అంతస్తులకు పెద్దగా డిమాండ్ ఉండటం లేదు. కానీ వర్టికల్ మిక్స్ విధానం అమల్లోకి వస్తే.. ఒకే భవనంలో కింది అంతస్తుల్లో వాణిజ్య సంస్థలు, పై అంతస్తుల్లో నివాస గృహాలు లేదా కార్యాలయాలకు అనుమతిస్తారు. దీనివల్ల భూమి వినియోగం పెరగడమే కాకుండా, నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉంది. నివాసం, పని ప్రదేశం ఒకే చోట ఉండటం వల్ల వాక్-టు-వర్క్ సంస్కృతి బలపడుతుంది. అంతేకాకుండా.. గ్రౌండ్ కవరేజ్పై కూడా స్పష్టమైన ఆంక్షలు, సరళీకరణలు ఉండనున్నాయి. 10 అంతస్తుల పైబడిన భవనాలకు హెచ్ఎండీఏ అనుమతులు, అంతకంటే తక్కువ ఉన్న వాటికి కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే విధానంలో కూడా మరింత స్పష్టత తీసుకురానున్నారు. ఈ ఏకీకృత నియమావళి అమల్లోకి వస్తే.. నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెరగడంతో పాటు హైదరాబాద్ వంటి నగరాల రూపురేఖలు మరింత ఆధునికంగా మారతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# షేర్ హోల్డర్స్ కి గుడ్ న్యూస్

ముంబై, మిడ్ క్యాప్ కేటగిరికి చెందిన బ్యాంకింగ్ సెక్టార్ స్టాక్ అయిన సిటీ యూనియన్ బ్యాంకు లిమిటెడ్ (జఊఎ ఖఅఱశీఅ దీుఅఏ ాఱఎ-ఊవఎ) తమ షేర్ హోల్డర్స్ కి గుడ్ న్యూస్ ని ప్రకటించింది. తాజాగా జరిగిన బ్యాంకు బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో 1:3 రేషియోలో బోనస్ షేర్ల జారీకి ఆమోదం తెలుపడం జరిగింది. ఈ బోనస్ ఇష్యూ ప్రకారం, ఎవరైతే బ్యాంకుకి చెందిన 3 షేర్స్ ని కలిగి ఉంటారో వారు అదనంగా 1 ఈక్విటీ షేర్ ని బోనస్ గా పొందుతారు. మరొకవైపు ఈ కంపెనీ షేర్ గత ఏడాది కాలంలో తమ షేర్ హోల్డర్స్ కి 53 శాతం లాభాన్ని అందించింది. బ్యాంకు ఎక్స్చేంజ్ ఫైలింగ్ ప్రకారం, తాజాగా జరిగిన బ్యాంకు బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో 1:3 రేషియోలో బోనస్ షేర్ల జారీని బ్యాంకు బోర్డు అఫ్ డైరెక్టర్స్ పరిగణలోకి తీసుకొని ఆమోదం తెలుపడం జరిగిందని, దీని అర్థం రికార్డు తేదీ నాటికి ఎవరైతే రూ. 1 ఫేస్ వ్యాల్యూ కలిగిన 3 ఈక్విటీ షేర్స్ ని తమ డీమ్యాట్ అకౌంట్ లో కలిగి ఉంటారో, అలాంటి వారికి అదనంగా రూ. 1 ఫేస్ వ్యాల్యూ కలిగిన 1 బోనస్ ఈక్విటీ షేర్ ని ఫ్రీగా జారీ చేయడానికి కంపెనీ డైరెక్టర్స్ బోర్డు ఆమోదం తెలిపిందని, ఇక ఈ బోనస్ షేర్లకి అర్హులైన షేర్ హోల్డర్స్ ని నిర్ణయించే రికార్డు డేట్ ని మాత్రం షేర్ హోల్డర్స్ ఆమోదం పొందిన తరువాత ప్రకటించనున్నామని బ్యాంకు తమ ఎక్స్చేంజ్ ఫైలింగ్ లో తెలిపింది. ఇక ఈ బోనస్ షేర్స్ ని షేర్ హోల్డర్స్ ఆమోదం పొందిన నాటి నుంచి 2 నెలల్లో క్రెడిట్ చేయనున్నట్లు బ్యాంకు తెలిపింది. నిన్నటితో ముగిసిన ట్రేడింగ్ సెషన్ లో సిటీ యూనియన్ బ్యాంకు లిమిటెడ్ షేరు ధర 3.8 శాతం లాభపడి రూ. 272.50 వద్ద ముగిసింది. ఈ షేరు 52 వారాల గరిష్ట ధర రూ. 324.10 గాను, అలాగే 52 వారాల కనిష్ట ధర రూ. 172.01 లుగా ఉంది. గత వారం రోజుల్లో ఈ షేరు ధర సుమారు 2 శాతం లాభాన్ని, అలాగే గత నెల రోజుల్లో సుమారు 14 శాతం లాభాన్ని, అదే విధంగా గత ఆరు నెలల్లో సుమారు 14 శాతం లాభాన్ని, ఇక గత ఏడాది కాలంలో సుమారు 53 శాతం లాభాన్ని, చివరగా గత ఐదేళ్ల కాలంలో 63 శాతం లాభాన్ని తమ వాటాదారులకి అందించింది. ఇక ప్రస్తుతం ఈ బ్యాంకు మార్కెట్ క్యాప్ రూ. 20,170 కోట్లుగా ఉంది. సిటీ యూనియన్ బ్యాంకు లిమిటెడ్ ని గతంలో కుంభకోణం బ్యాంకు లిమిటెడ్ అని పిలిచేవారు. ప్రస్తుతం ఈ బ్యాంకు తమ కస్టమర్స్ కి బ్యాంకింగ్ సర్వీసులతో పాటు ఫైనాన్సియల్ సర్వీసెస్ ని కూడా అందిస్తుంది. ఇక ఈ బ్యాంకు తమిళనాడు రాష్ట్రంలోని కుంభకోణం కేంద్రంగా తమ వ్యాపార కార్యకలాపాలని నిర్వహిస్తుంది. ఈ బ్యాంకుని అక్టోబర్ 31, 1904వ సంవత్సరంలో ప్రారంభించడం జరిగింది. 2025 చివరి నాటికి ఈ బ్యాంకులో మొత్తం 7605 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

# స్వీయగణనను అందరూ సద్వినియోగం చేసుకోవాలి



పెద్దపల్లి, : జనాభా లెక్కల్లో భాగంగా ఇళ్ల గణనకు సంబంధించి ప్రజలే స్వీయ గణన చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. కలెక్టరేట్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1881 సంవత్సరం నుంచి ప్రతీ పదేళ్ళకు ఒకసారి జనాభా లెక్కలు చేపడుతున్నారన్నారు. ఈసారి 16వ జనగణన జరగనున్నదని తెలిపారు. జనాభా లెక్కల సందర్భంగా తమ వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రతి ఒక్కరూ తమ వివరాలను ఇవ్వాలన్నారు. జనగణన రెండు దశల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. మే 11 నుంచి జూన్ 9 వరకు మొదటి దశగా ఇళ్ల గణన చేపట్టి ఇళ్లకు సంబంధించిన 33 ప్రశ్నల వివరాలు సేకరిస్తామని చెప్పారు. రెండో దశలో వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో జనాభా గణన నిర్వహిస్తామని తెలిపారు. జనగణన మొత్తం డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం 1548 హౌస్ లిస్టింగ్ బ్లాకులు గుర్తించగా, ప్రతి బ్లాక్లో సుమారు 300 ఇళ్లు, సుమారు 800 మంది జనాభా ఉంటారని తెలిపారు. ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించామని తెలిపారు. వెబ్సైట్లో కుటుంబంలోని ఒక సభ్యుడు లాగిన్ అయి వివరాలు నమోదు చేస్తే సరిపోతుందని చెప్పారు. నమోదు అనంతరం రిజిస్టర్డ్ మొబైల్ నంబర్కు 11 అంకెల ప్రత్యేక నంబర్ వస్తుందని, ఆ నంబర్ను ఎన్యూమరేటర్కు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. ఏవైనా పొరపాట్లు ఉంటే ఎన్యూమరేటర్ ద్వారా మాత్రమే సరిచేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ప్రతి ఎన్యూమరేటర్కు 11 అంకెల కోడ్ ఉన్న ఐడీ కార్డు ఉంటుందని చెప్పారు. డిజిటల్ విధానం వల్ల వేగంగా, కచ్చితంగా గణన పూర్తవుతుందని, డేటా గోప్యతకు పూర్తి భద్రత ఉంటుందని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ యాసంగి సీజన్లో 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా 345 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. సాఫ్ట్వేర్ను అప్డేట్ చేయడంతో ఇకపై మాన్యువల్ ట్రక్ షీట్ ఉండదని స్పష్టం చేశారు. రాబోయే రెండు రోజుల్లో కొనుగోలు వేగం పెరుగుతుందని, రోజుకు 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. గతంలో ఒక రోజులో 19 వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేశామని గుర్తు చేశారు. వేసవి తీవ్రత కారణంగా హమాలీల లోడింగ్ సమస్యలు ఉన్నప్పటికీ అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ధాన్యాన్ని 112 రైస్మిల్లులకు కేటాయించినట్లు తెలిపారు. సీఎంఆర్ బియ్యం డెలివరీలో 2024-25ఖరీఫ్ 100 శాతం, రబీ 93 శాతం, 2025-26 ఖరీఫ్ 36 శాతం పూర్తయ్యిందని తెలిపారు. సీఎంఆర్ డెలివరీలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. విద్య, ఆరోగ్య రంగాలకు జిల్లా పరిపాలన అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రెండు సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్య అభివృద్ధిపై దృష్టి సారించినట్లు తెలిపారు. జిల్లాలోని 340 ప్రాథమిక పాఠశాలలకు రిసోర్స్ పర్సన్లు పంపి బోధనలో మెరుగుదల కోసం సూచనలు అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఓరల్ రీడింగ్, రీడింగ్ కంప్రహెన్షన్, గణిత సామర్థ్యాలు వంటి పారామీటర్లలో పురోగతి సాధించామని చెప్పారు. ఈ పురోగతిని గుర్తించి ఎన్ఈఆర్టీ జిల్లాను రాష్ట్రంలో టాప్ పెర్ఫార్మర్గా గుర్తించి కేస్ స్టడీకి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో సీనియర్ ఉపాధ్యాయులతో ప్యానెల్ ఏర్పాటు చేసి ప్రతీ తరగతిని పరిశీలించి ఉపాధ్యాయులకు వ్యక్తిగతంగా సూచనలు ఇస్తున్నామని చెప్పారు. ఈ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ ఏఓ ప్రకాష్, ఈడిఎం కవిత పాల్గొన్నారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించాలి

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. విద్యానగర్లోని బీసీ భవన్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్రెడ్డి బీసీ వ్యతిరేక వైఖరిని మార్చుకుని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానం ప్రకారం 42శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. ఛఊఎ4.2.యజూస్త్రప్రభుత్వం బీసీలను అణచివేసేందుకు ప్రయత్నించినప్పటికీ పంచాయతీ ఎన్నికలలో 53శాతం, మున్సిపల్లో 68 శాతం బీసీలు గెలిచి సత్తా చాటారని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లపై కోర్టులో ఉన్న స్టేను ఎత్తివేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఎంను ఆయన కోరారు.

# హైదరాబాద్ టు ముంబై 3 గంటల్లోనే



హైద్రాబాద్: తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబైకి ప్రయాణించే వారికి శుభవార్త. ఇప్పటికే హైదరాబాద్ నుంచి నాగపూర్కు వందే భారత్ ఎక్స్ప్రెస్ ట్రైన్ పరుగులు పెడుతుండగా.. త్వరలోనే మరింత స్పీడ్గా నగరం నుంచి ముంబై చేరుకోవచ్చు. 761 కిలోమీటర్ల మేర నిర్మించ తలపెట్టిన హైదరాబాద్ - పుణె - ముంబై హైస్పీడ్ రైలు కారిడార్కు సంబంధించిన కీలక అప్డేట్ వచ్చింది. ఈ ప్రాజెక్టు డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ పనులు పూర్తయ్యాయని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. (ఏప్రిల్ 27)న అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన.. ఈ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఈ హైస్పీడ్ రైలు కారిడార్లో మొత్తం 12 స్టేషన్లు ఉంటాయని.. అవసరమైన చోట ఎలివేటెడ్, అండర్గ్రౌండ్ సెక్షన్లను నిర్మిస్తామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ముఖ్యంగా వికారాబాద్ సమీపంలో 4.6 కిలోమీటర్ల పొడవైన భారీ టన్నెల్ను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. గంటకు గరిష్టంగా 330 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ ట్రైన్లు అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నగరం నుంచి ముంబైకి మూడు గంటల లోపే చేరుకోవచ్చునని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కేవలం రవాణా సౌకర్యమే కాకుండా.. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే ఎకనామిక్ గ్రోత్ కారిడార్గా నిలుస్తుందని అన్నారు. ఇక భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి చెన్నై, బెంగళూరులకు కూడా హైస్పీడ్ ట్రైన్ కారిడార్లు ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఈ ప్రతిపాదిత కారిడార్లపైనా మంత్రి కోమటిరెడ్డి సమీక్ష నిర్వహించారు. అమరావతి మీదుగా వెళ్లే ఫ్యూచర్ సిటీ - చెన్నై కారిడార్ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. అలాగే మన్ననూర్, సోమశిల మీదుగా వెళ్లే బెంగళూరు కారిడార్ అలైన్మెంట్ ప్లాన్లను కూడా నిశితంగా పరిశీలించారు. ఈ భారీ ప్రాజెక్టుల వేగవంతం కోసం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సంప్రదింపులు జరిపి కీలక పాలసీ నిర్ణయాలు తీసుకుంటామని కోమటిరెడ్డి వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు సమన్వయంతో పని చేయాలని, ప్రాజెక్టులు నిర్ణీత సమయంలో పూర్తి కావడానికి తెలంగాణ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఇక ఇదే సమావేశంలో వైద్య సౌకర్యాలపై కీలక కామెంట్స్ చేశారు. హైదరాబాద్లోని సనత్నగర్ టిమ్స్ ఆసుపత్రిని జూన్ 2వ తేదీన ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు.

# సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకం

ధర్మపురి,: విద్య నైపుణ్య అభివృద్ధి తో బలహీన వర్గాల ఉపాధి అవకాశాలు విస్తరణ చేయడం వల్ల ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'చింతన్ శివిర్' సదస్సు హర్యానా రాష్ట్రం లోని చండీగఢ్లో జరిగింది. ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తరఫున సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం, సంక్షేమ పథకాల సమర్థ అమలు, బలహీన వర్గాల సమగ్ర అభివృద్ధి వంటి కీలక అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించారు. తెలంగాణతో పాటు ఉత్తర ప్రదేశ్, నాగాలాండ్, ఒడిశా, మేఘాలయ, అస్సాం, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, హర్యా నా, ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ముఖ్య కార్యదర్శులు, అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, ఉపసంచాలకులు చింతనతో శివిర్ లో పా ల్గొన్నారు. సదస్సు లో పాల్గొన్న మంత్రి లక్ష్మణ్ కుమార్ పలు సూచనలు చేశారు. సామాజిక న్యాయ రంగంలో కేంద్ర-రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగుల సంక్షేమానికి బడ్జెట్లో మరిన్ని నిధులు కేటాయించి వారి సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. విద్య, నైపుణ్యాభివృద్ధి పెంపొందించడం ద్వారా ఉపాధి అవకాశాల విస్తరించి బలహీన వర్గాల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వాలు కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, వేగవంతం కోసం డిజిటల్ విధానాలను విస్తృతంగా వినియోగించాలని మంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న వినూత్న సంక్షేమ కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ చింతన్ శివిర్ ద్వారా రాష్ట్రాల మధ్య ఉత్తమ విధానాలను అమలుకు అలాగే కార్యాచరణలో సమన్వయం సాధించేందుకు ప్రయోజనకరమైన వేదికగా నిలిచిందని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.

# మాజీ సైనికుల సంక్షేమానికి చర్యలు

హైదరాబాద్, : మాజీ సైనికుల సంక్షేమం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుందని, తెలంగాణ ఎక్స్ సర్వీస్మెన్ కార్పొరేషన్ ఏర్పాటు ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందని హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్ పేర్కొన్నారు. పంజాగుట్టలో ఉన్న సైనిక సంక్షేమ విభాగం ప్రధాన కార్యాలయాన్ని ఆయన సందర్శించి మరింత శుభ్రత పాటించాలనిసూచనలు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు, ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ ప్రణాళికలపై కొత్త డైరెక్టర్ ఎ.ఆర్. రావు ఈ సందర్భంగా ప్రజెంటేషన్ ఇచ్చారు. "మన సైనికులు" వెబ్సైట్లో సుమారు 40,000 మంది మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యుల వివరాలు నమోదయ్యాయని... రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వాల నుంచి నగదు గ్రాంట్లు మాత్రమే కాకుండా, గృహ నిర్మాణం, విద్య, ఉపాధి వంటి అనేక సంక్షేమ పథకాలు వీరికి అందుబాటులో ఉన్నాయని ఆనంద్ వివరించారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280